Office Of The Advisor (communications)
Govt. Of Andhra Pradesh

**PRESS RELEASE**

# భూ క్రయ విక్రయాలలో అక్రమాలకు 'భూధార్'తో చెక్

## 'భూసేవ' పథకం ప్రారంభోత్సవ సభలో ముఖ్యమంత్రి

### కేంద్ర వైఖరిని నిరసిస్తూ సాగేపోరుకు వెంట నడవండి

### రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు పిలుపు

అమరావతి, ఏప్రిల్ 11: భూ క్రయ విక్రయాల్లో అక్రమాలు అరికట్టడానికి, భూములకు ఇస్తున్న గుర్తింపు కార్డులే భూధార్ కార్డులని, రెవెన్యూ, భూసేవా సంస్కరణలో ఇదో నవ్య అధ్యాయమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. ఉండవల్లిలోని గ్రీవెన్స్ సెల్ హాలులో ఆయన బుధవారం రాత్రి 'భూసేవ' పథకాన్ని ప్రారంభించారు. కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలంలో తొలుత ఐదు గ్రామాలలో, ఉయ్యూరు మునిసిపాలిటీ పరిధిలో ప్రయోగాత్మకంగా పథకాన్ని అమలు చేస్తామని, మే నెలాఖరుకు కృష్ణా జిల్లాలో, అక్టోబర్ 2 వ తేదీనాటికి రాష్ట్రమంతా భూధార్ కార్డులిచ్చి 'భూసేవ' పథకాన్ని విస్తరిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు.

దేశంలో తొలిసారి భూధార్ కార్డుల పథకాన్ని ప్రారంభించిన ఘనత ఆంధ్రప్రదేశ్‌కే దక్కిందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి టెక్నాలజీలో మన బలాన్ని దేశానికి ఎలుగెత్తి చాటాలని ఆయన పిలుపునిచ్చారు. మనిషి గుర్తింపునకు ఆధార్ కార్డు ఎలాగో, భూమికి భూధార్ ఒక గుర్తింపు కార్డు అన్నారు. ప్రతి భూకమతానికీ, పట్టణ ఆస్తులకు , పంచాయతీలో ఆస్తులకు 11 అంకెల విశిష్ట సంఖ్య కేటాయిస్తామని, తాత్కాలిక భూధార్, శాశ్వత భూధార్ అనే రెండు దశల్లో ఈ సంఖ్య కేటాయింపు జరుగుతుందన్నారు. రెవెన్యూ, పురపాలక, సర్వే, రిజిస్ట్రేషన్, పంచాయతీరాజ్, అటవీ శాఖల అనుసంధానంతో రూపొందించిన అద్భుత కార్యక్రమమని తెలిపారు. భూసేవ పథకం ద్వారా ఇరవై సేవలు అందుబాటులోకి వస్తాయని ముఖ్యమంత్రి తెలిపారు. భూ మార్పిడి, క్రయ విక్రయాల్లో ఎటువంటి అక్రమాలకు చోటివ్వకూడదనే ఉద్దేశంతో, ప్రజలు, ప్రభుత్వ భూముల పరిరక్షణకు ఈ సంస్కరణలు తెచ్చామని, ప్రజలు సహకరించి, టెక్నాలజీతో తీసుకువచ్చిన మార్పులకు మద్దతునివ్వాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

భూసేవ ద్వారా రాష్ట్రంలోని 2.84 కోట్ల వ్యవసాయ భూములకు,0.50 కోట్ల పట్టణ ఆస్తులకు, 0.85 కోట్ల గ్రామీణ ఆస్తులకు భూధార్ కేటాయింపు జరుగుతుందన్నారు. జగ్గయ్యపేట మండలం నుంచి కానూరి శిరీష, ఉయ్యూరు మునిసిపాలిటీ పరిధిలో నివసిస్తున్న కొణతాల రాజేశ్వరి తొలి భూధార్ కార్డులను ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందుకున్నారు.

## చరిత్రాత్మక అధ్యాయం

భూసేవ ద్వారా భూధార్ కార్డుల పంపిణీ చేపట్టడం చరిత్రాత్మక అధ్యాయమని ముఖ్యమంత్రి చంద్రబాబు అభివర్ణించారు. ఒకప్పుడు గ్రామ మునసబు భూములు వివరాలు రాసేవారని, ఆ రికార్డులు ఎవరికీ అర్థం కాకపోయేవని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ప్రజలందరికీ అర్ధం అయ్యే రీతిలో రికార్డులు రాసే వ్యవస్థను తెలుగుదేశం వ్యవస్థాపకులు, నాటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావు తీసుకొచ్చారని, తెలంగాణలో పటేల్, పట్వారీ వ్యవస్థను, ఆంధ్రలో మునసబుల వ్యవస్థను రద్దు చేసి ప్రజలకు పీడననుంచి విముక్తి కలుగజేశారని అన్నారు. రానున్న రోజుల్లో పెళ్లి కానుకలను కూడా ఆధార్ తో అనుసంధానిస్తామని, ఒక్క పైసా దుర్వినియోగం కాకుండా నీతివంతమైన పాలన అందించడం తమ ధ్యేయమని చంద్రబాబు స్పష్టం చేశారు. ఏ కుటుంబానికి ఏ రకమైన లబ్ది చేకూరిందీ ఆధార్ ద్వారా ప్రభుత్వం బేరీజు వేసుకుంటుందని, భవిష్యత్తులో మన ముఖ చిత్రంతో సెల్ ఫోన్ పనిచేసే రోజు వస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు. టెక్నాలజీని ఉపయోగించుకుంటే మోసపోకుండా లబ్ది పొందవచ్చని, ఉపయోగించుకోని పక్షంలో వెనుకంజలోనే ఉంటామన్నారు.

## ఆధార్ లానే భూధార్

మనిషికి కనురెప్పల ద్వారా, వేలి ముద్రల ద్వారా ఆధార్ వచ్చిందని ముఖ్యమంత్రి చెప్పారు. భూధార్‌ను జియో ట్యాంగింగ్ వ్యవస్థ ద్వారా ద్వారా తీసుకొస్తున్నామని, భూములు,ఆస్తుల లావాదేవీల్లో అక్రమాలకు ఇక ఆస్కారం ఉండదని, భూములు కొన్నా, విక్రయించినా ఆటోమేటిక్ గా లావాదేవీలు జరుగుతాయని వివరించారు. గతంలోలా ఆఫీసులకు వెళ్లి అసహనానికి గురయ్యే పరిస్థితి భవిష్యత్తులో ఉండదని, వేలిముద్రలు, కనురెప్పలతో నవ్య గుర్తింపు పద్ధతులు వచ్చాయని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రం చేయనటువంటి కార్యక్రమానికి మన రాష్ట్రంలో శ్రీకారం చుట్టామని తాను సగర్వంగా చెబుతున్నానని ముఖ్యమంత్రి తెలిపారు. ఇప్పటికే 25 సర్వీసులు ఆన్‌లైన్ లో ఉంచామని, రానున్న రోజుల్లో టెక్నాలజీ మన ముంగిటకు మరింత విస్తృతంగా వస్తుందని సీఎం చెప్పారు.

భూసేవ ఒక ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు అని, విజయవంతం చేస్తే దేశంలో మనరాష్ట్రానికి ఖ్యాతి దక్కుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. పంటలకు తెగుళ్లు వస్తే వాటిని డ్రోన్ టెక్నాలజీతో గుర్తించి నివారిస్తామని చెప్పారు. అవసరం ఉన్నా లేకున్నా విచక్షణా రహితంగా క్రిమిసంహారక మందులు, ఎరువులు వాడట సరికాదన్నారు. ఇటీవల కాలంలో పంటల దిగుబడి అధికంగా తేవడానికి సూక్ష్మ పోషకాలను సరఫరా చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రానున్న కాలంలో టెక్నాలజీని మరింత వినియోగంలోకి తెస్తామని, సంక్షేమ కార్యక్రమాలను మరింత పటిష్టంగా అమలు చేస్తామని సీఎం చెప్పారు.

**విభజన తర్వాత సంక్షోభాన్ని సరిదిద్దాను: ముఖ్యమంత్రి**

రాష్ట్ర విభజన జరిగిన తర్వాత అన్నీ సమస్యలే వచ్చాయని, పెన్షన్లు వస్తాయా. రావా? జీతాలు వస్తాయా; పిల్లల చదువులు సాగుతాయా? అని నాడు ప్రజలు సందేహించారని, తాను కేంద్రం సహకారం లేకుండానే ఉద్యోగుల అండతో కష్టపడి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నానని చంద్రబాబు తెలిపారు. రైతు రుణ ఉపశమనం కింద మరో వాయిదా చెల్లిస్తే రుణమాఫీ పూర్తవుతుందని, పూర్తిగా రైతు రుణమాఫీ చేసేదాకా తనదే బాధ్యత అని చంద్రబాబు స్పష్టం చేశారు. నాలుగేళ్ల పాలనలో కరెంటు కొరత లేకుండా చేశామని, గ్యాస్ 100% ఇస్తున్నామని, నూటికి నూరు శాతం సిమెంటు రోడ్లు వేస్తున్నట్లు తెలిపారు.

దేశంలో మరే రాష్ట్రంలో ఇలా అభివృద్ధి సాధించలేదన్నారు. నదుల అనుసంధానంతో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తున్నామని, పట్టిసీమ ప్రాజెక్టుతో కృష్ణాడెల్టాకు ఎంతో మేలు జరిగిందన్నారు. వ్యవసాయ రంగంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు సీఎం చెప్పారు. టెక్నాలజీని సమర్ధంగా ఉపయోగించుకోవడం వల్లనే సత్ఫలితాలు సాధించినట్లు, ప్రజా సాధికార సర్వే ద్వారా కుటుంబాల ఆర్థిక స్థితిగతులపై సర్వే చేశామని, కుటుంబాలను ఎలా ఆదుకోవాలో బేరీజు వేసుకున్నామని తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో పూర్తి స్థాయి కంప్యూటరైజేషన్ చేశామన్నారు. ఈ –ప్రగతి ప్రాజెక్టు తీసుకొచ్చి మెరుగైన సేవలను అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు.

ప్రభుత్వం ఇన్ని మంచిపనులు చేస్తుంటే ప్రజల్లో అసంతృప్తి ఎందుకు రావాలి? ప్రజల సంతృప్తి శాతం పెంచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సీఎం అన్నారు. పేదలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అనేక పథకాలను తెచ్చినట్లు, పేదరికం లేని సమాజం అంటే ప్రతి ఒక్కరి ఆదాయం పెంచటమని, ఒక్కో పేద కుటుంబం నెలకు రూ.10 వేల ఆదాయం తెచ్చుకునేలా చేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

## కొందరి లాలూచీతో కేంద్రం ప్రత్యేక హోదాను ఇవ్వటం లేదు

కొందరి లాలూచీతోనే కేంద్రం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వలేదని, తాను ఒక పర్యాయం ఒకటి అనుకుంటే సాధించి తీరతానని, కేంద్రానికి భయపడే సమస్యే లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. తానెప్పుడూ ఎవరితో రాజీపడలేదన్నారు. నాలుగేళ్లలో 29 పర్యాయాలు రాష్ట్రాభివృద్ధి కోసం ఢిల్లీ వెళ్లినా మాయమాటలు చెప్పి మభ్యపెట్టారని విమర్శించారు. అవిశ్వాస తీర్మానం చర్చకు రాకుండా ఏఐఏడీఎంకే తో కలసి కుట్ర చేశారని, ప్రజలను మోసగించాలనుకుంటే ప్రజలు మోసపోరని ప్రధానమంత్రికి చెబుతున్నానని ముఖ్యమంత్రి అన్నారు. తాము అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇస్తే కేంద్రం ఏఐఏడీఎంకేను అడ్డంపెట్టుకుని రాజకీయం చేసిందని అన్నారు.

ప్రధాని మోడీ తిరుపతిలో వెంకన్న సాక్షిగా వాగ్దానాలు చేశారని, ఆయన వాగ్దాన భంగం చేసినందువల్ల ఈనెల 30 వ తేదీన అదే తిరుపతిలో అందుకు నిరసనగా సభ నిర్వహిస్తున్నామని చంద్రబాబు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలంతా సహకరించాలని పిలుపునిచ్చారు. కేంద్రం ఎట్టి పరిస్థితులలోనూ ప్రత్యేక హోదా ఇవ్వాలి. విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. తనకు ఎలాంటి స్వార్థం లేదని, రాష్ట్రం కోసం తాను డబ్బులు ఇవ్వమని అడిగితే తన మీద అవినీతి ఆరోపణలు చేస్తున్నారని, రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రధానిని అడిగితే ఇక్కడుండే నాయకులు నన్ను విమర్శిస్తారెందుకని ప్రశ్నించారు.

నాలుగేళ్లు ఏమీ మాట్లాడని పవన్ కల్యాణ్ ఇప్పుడు మాట్లాడుతున్నారని, చవకబారు రాజకీయాలతో ఎవరూ విజయం సాధించలేరని, ఇది చరిత్ర చెప్పిన సత్యమన్నారు. 1984లో ఎన్టీఆర్ ను కూలదోసిన ఇందిరాగాంధీ ప్రజాందోళనకు తలొగ్గి మళ్లీ ఎన్టీఆర్ ను ముఖ్యమంత్రిగా చేసిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. కేంద్రానికి వ్యతిరేకంగా పోరాటం ఎక్కడా ఆగకూడదని, ప్రతి వ్యక్తి ఒక శక్తిగా తయారు కావాలని, తాను నేను నాలుగేళ్లకంటే ముందే ఎన్డీయే నుంచి తప్పుకుంటే ఈ మాత్రం కూడా అభివృద్ధి చెందేది కాదని తెలిపారు. హింసకు తావులేని రీతిలో ఉద్యమిద్దామని, మరోవైపు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.